ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -73 పేజీలు - 8 వెల - 03/- గురువారం 2 జులై 2026

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకెళ్లాలి -కేంద్రీయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పిలుపు**




**అనంతపురం ప్రతినిధి, జులై 01,(రిపబ్లిక్ న్యూస్):** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురములో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ , రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ , రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డా.శంకరఆచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి, తదితరులు పాల్గొన్నారు. మిగతా 2లో.

# హద్దుమీరితే ఆటకట్టిస్తాం



**సోషల్ మీడియా దుర్వినియోగంపై పవన్ హెచ్చరిక!**

- వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయొద్దని పవన్ హెచ్చరిక
- ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు సహించబోమని స్పష్టం
- సైబర్ వేధింపుల బాధితుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తే బీఎన్ఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు

**అమరావతి జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** సోషల్ మీడియా దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. ఒకరి హక్కులను మరొకరు హరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును స్వాగతిస్తామని, కానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సహించబోమని స్పష్టం చేశారు.మత విశ్వాసాలను దెబ్బతీయడం రాజ్యాంగం కల్పించిన హక్కు కాదని పవన్ అన్నారు. మిగతా 2లో.



# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

**ముందు దేశానికి..**

**ఆ తర్వాత తల్లిదండ్రులకు..**

**ఆర్మీ చీఫ్ ఎమోషనల్ మూమెంట్**

- 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన జనరల్ ధీరజ్ సేథ్
- మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రికి సెల్యూట్
- అనంతరం తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఆర్మీ చీఫ్
- ఈ భావోద్వేగ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్

భారత సైన్యం 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్ తొలి రోజే అందరినీ కదిలించే భావోద్వేగ క్షణానికి కారణమయ్యారు. మిగతా 2లో.



# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి

- తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన
- అందుబాటులో నైపుణ్యం కలిగిన మానవ వనరులు
- హీరో సంస్థ ఎపికి రావడానికి ప్రత్యేక కృషి చేశా
- సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

**తిరుపతి,జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతిలో హీరో మోటార్స్ జీపీసీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హీరో సంస్థ తిరుపతికి రావడానికి తాను ప్రత్యేకంగా కృషి చేశానని, మరో రాష్ట్రానికి వెళ్లాల్సిన సంస్థను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్త తరం బ్యాటరీ ఆధారిత వాహనాల తయారీ కూడా తిరుపతిలోని హీరో ఎ÷-లాంట్‌లోనే జరగనుందని వెల్లడించారు. ఆంధప్రదేశ్ యువత ప్రతిభావంతులని, ప్రపంచ స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకునే సామర్థ్యం వారికి ఉందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యధికంగా ఇంజినీరింగ్ చదువుకున్న మిగతా 2లో.



# మావిగన్ కు కట్టుబడి ఉన్నా



**వచ్చే ఎన్నికలు 'మావిగన్ వర్సెస్ అమరావతి'..**

**చూసుకుందాం: జగన్**

- మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని వ్యాఖ్య
- ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టీకరణ

**అమరావతి జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** ఏపీ రాజధాని అమరావతిని వైసీపీ అధినేత జగన్ మరోసారి తిరస్కరిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము మావిగన్ కే కట్టుబడి ఉన్నామని... వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి అని ఆయన అన్నారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్ కు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని చెప్పారు మిగతా 2లో.



# నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు

- రాష్ట్రాభివృద్ధి, తెలుగువారిని అందలం ఎక్కించటమే కూటమి లక్ష్యం: చంద్రబాబునాయుడు
- పొదుపులో మన డ్వాక్రా మహిళలు దేశానికే ఆదర్శమన్న ముఖ్యమంత్రి
- సైకో సహకారంతోనే గొడ్డలి పార్టీ నేతల మాటలు, చేతలు అని ఆగ్రహం
- మావిగన్ అన్న వ్యక్తులు రాజధానికి రౌడీల్లా దండయాత్రలు చేస్తున్నారన్న సీఎం

# ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

**ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన నారా లోకేశ్**

**ఇంజినీరింగ్ విభాగంలో 70.52 శాతం విద్యార్థులు క్వాలిఫై**

**అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 89.59 శాతం ఉత్తీర్ణత**



**అమరావతి జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఫలితాలను విడుదల చేశారు. మిగతా 2లో.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు
- ఆర్థిక శాఖ ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ
- ఇకపై 25లోగా జీతాల బిల్లులు సమర్పించాలని ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆనందం



**హైదరాబాద్‌జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల ఒకటో తేదీనే వారి జీతాలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న మిగతా 2లో.

# పాలనపై చర్చకు సిద్ధం..

- దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పు
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ప్రతిసవాల్
- ప్రభుత్వ వైఫల్యాలు నిరూపించకుంటే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- అబద్ధాలు ఆపి (ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు




**హైదరాబాద్‌జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వంటి ఏ అంశంపైనైనా ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. దమ్ముంటే తేదీ, స్థలం, సమయం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన ప్రతిసవాల్ విసిరారు. వరంగల్, హైదరాబాద్‌లో మిగతా 2లో.

# మావిగన్ కు కట్టుబడి ఉన్నా

**మొదటిపేజీ తరువాయి**

అమరావతి పేరుతో చంద్రబాబు సాగిస్తున్న స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని, అందుకే ఈ మావిగన్ ప్రతిపాదనను తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సరికొత్త ప్రతిపాదనకు మద్దతు ఇచ్చేవారంతా వైసీపీకే ఓటు వేస్తారని, వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మావిగన్ ను చేరుస్తామని స్పష్టం చేశారు.

### బీచ్‌లను కూడా మద్యం కేంద్రాలుగా మారుస్తారా?: జగన్

"కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా చంద్రబాబు ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది" అంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తే, రేపు సామాన్య కుటుంబాలు బీచ్‌లకు ఎలా వెళ్తాయని కూటమి సర్కార్‌ను నిలదీశారు.
ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, వేధింపులకు గురిచేయడం, చివరకు లాకప్ డెత్‌లకు పాల్పడటం వంటి దారుణాలు రాష్ట్రంలో జరుగుతున్నాయని జగన్ ఆరోపించారు. చంద్రబాబుకు అసలు మానవత్వం ఉందా? అని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం... కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి

**మొదటిపేజీ తరువాయి**

విద్యార్థులు ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో సముద్ర తీర ప్రాంతాలు, పోర్టులు, రోడ్లు, రైల్వే అనుసంధానం, విద్యుత్, నీటి వనరులు పరిశ్రమలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. త్వరలో దుగ్గరాజుపట్నం పోర్టు, నాలుగు లైన్ల రైల్వే మార్గాలు అందుబాటులోకి రావడంతో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యమని, ఇప్పటికే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడించారు. వీటి ద్వారా సుమారు 10 లక్షల ఉద్యోగాలు సృష్టించే
అవకాశం ఉందన్నారు. ఒకసారి ఎంఓయూ కుదిరిన తర్వాత ఆ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్‌ను 2028 డిసెంబర్‌లోగా ప్రారంభించేలా చర్యలు కొనసాగుతున్నాయని, అమరావతిలో వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటింగ్ తయారీకి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. హీరో సంస్థ మహిళా పోలీసులకు 63 వాహనాలను అందించడం అభినందనీయ మని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే 'పీ4' కార్యక్రమంలో హీరో సంస్థ భాగస్వామ్యం కావడాన్ని స్వాగతిస్తూ, పరిశ్రమ ఉన్న ప్రాంతంలో సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఒక సీఈవోను నియమించాలని సూచించారు. మానవ వనరుల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి కీలకమని, లక్షలాది మంది యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

### నేరస్థులకు వంతపాడే రాజకీయ పార్టీలు మనకెందుకు

"పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో పెట్రోలు, డీజిల్ ధరలు కూడా పెరిగాయి. ఈ సమయంలోనే ఇథనాల్ వినియోగించుకుని ఇంధన పొదుపు చేయాల్సి ఉంది. ఇథనాల్ తయారీ కోసం మొక్కజొన్న లాంటి పంటలు అవసరం అవుతాయి. రైతులు ఈ ప్రత్యామ్నాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరిశ్రమల్ని ఆహ్వానించడానికి సమయం పడుతుంది. కానీ తరిమి కొట్టడానికి ఒక్క క్షణం చాలు. గత పాలకులు పరిశ్రమల్ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టారు. కర్ణాటకకు వెళ్లిపోవాల్సిన హీరో మోటార్స్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చి ఇక్కడ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేసేలా కృషి చేశాం. కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌కు కూడా 3వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నాం. 2028 నాటికి ఆ రాయలసీమలో స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి కూడా ప్రారంభిస్తుంది. నా ప్రయత్నం అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందించటమే. గొడ్డలి పార్టీ తీవ్రవాదుల తరహాలో అందరినీ భయాందోళనలకు గురి చేస్తోంది.
రోజుకో ఫేక్ న్యూస్, రోజుకో విన్యాసంతో గొడ్డలి పార్టీ కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోంది. గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చింది. మేం అధికారంలోకి వచ్చాక ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా నియంత్రించాం. గత పాలకులు ప్రజల్ని బంధించి, భయపెట్టి మరీ సమావేశాలు పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాకే ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. రాష్ట్ర ప్రజలందరికీ అవసరమైన రాజధాని అమరావతి గొడ్డలి పార్టీకి అవసరం లేదు. అందుకే ఇంకా రాజధానిపై కుట్రలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఇప్పుడు వేగంగా పనులు జరుగుతుంటే సహించలేకపోతున్నారు. గత పాలకుడు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలతో రాష్ట్రానికి రాజధానే లేకుండా పోయింది. మూడు రాజధానుల పేరిట గందరగోళ పరిచారు. ఎవరైనా పొరుగు రాష్ట్రాలకు వెళ్తే ఏపీకి మూడు రాజధానులా అని హేళనకు గురయ్యారు. పార్లమెంటులో శాశ్వత రాజధాని చట్టం చేస్తుంటే మావిగన్ అంటూ కొత్త ఆటలు మొదలు పెట్టారు. అమరావతి పరిరక్షణ కోసం అంటూ రౌడీలతో ఇప్పుడు దండయాత్ర చేస్తున్నారు. నిలకడలేని వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు" అని మండిపడ్డారు.

### హోంమంత్రిపై అవమానర వ్యాఖ్యలు

"విజయవాడలో యువకుడి అదృశ్యం ఘటన నా దృష్టికి వస్తూనే సీఐను సస్పెండ్ చేశాం, చర్యలకు ఆదేశించాం. కానీ వైసీపీ నాయకులు కులాల మధ్య వివాదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులతో విష ప్రచారం చేస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో ఆ పార్టీ నేతలు రెచ్చి పోతున్నారు. హోం మంత్రి అనిత మేకప్ పై ఆ పార్టీ నేతలు అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారు. మహిళా కమిషన్ ఈ అంశంపై గట్టిగా ప్రశ్నించినా ఆ పార్టీ నేతలు తమ వ్యాఖ్యల్ని సమర్థించుకుంటున్నారు. జగన్ సహకారం లేకపోతే ఆయన వెంట ఉన్న నేతలు విచ్చలవిడిగా మాట్లాడే పరిస్థితి ఉండదు. మా పార్టీలో ఈ తరహా మాట్లాడిన వారిని పార్టీ నుంచి బయటకు పంపించాం.
మేం యజ్ఞంలా అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా దానికి ఆటంకం కలిగిస్తున్నారు. నేరాలు చేసే పార్టీ, నేరస్తులను కాపాడే పార్టీ, నేరస్తులతో రాజకీయాలు చేసే పార్టీని ఇప్పుడే చూస్తున్నాం. అర్హత లేని వారిని అందలం ఎక్కిస్తే రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సమస్యలు వస్తాయి. ఇలాంటి వ్యక్తులను జైల్లో పెట్టాలంటే ఒక్క నిముషం పని కానీ మేం ప్రతీ కార రాజకీయాలు చేయటం లేదు. మా దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి కావాలని, తెలుగు వారిని అందలం ఎక్కించాలనే. రాష్ట్రంలో రౌడీయిజం చేయాలన్నదే వైసీపీ నేతల ఆలోచన. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అనే సంకల్పం ప్రజలు చేయాలని కోరుతున్నాను. 'ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్' అన్నదే మన నినాదం కావాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేరస్తులకు వంతపాడటం, నేరాలు చేయటం రాజకీయ పార్టీలకు తగదు. ఇలాంటి పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### డ్వాక్రా మహిళలకు అభినందన

అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. సెర్ప్ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రదర్శించిన అధునాతన కుట్టు మిషన్లను ముఖ్యమంత్రి తిలకించారు. ఆధునిక కుట్టు మిషన్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటాన్ని అప్పటికప్పుడే తయారు చేసిన మహిళలు దానిని ఆయనకు అందించారు. అరటి నారతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులను చూసిన ముఖ్యమంత్రి డ్వాక్రా సంఘాల మహిళలను అభినందించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న ఉద్యాన పంటల ఉత్పత్తులు, మత్స్యకార బోట్లకు బిగించే ట్రాన్స్ పాండర్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

# ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక దినం మాత్రమే కాదని, ఈ యువ సంస్థ ప్రస్థానంలో ఇది ఒక కీలకమైన మైలురాయి అని అన్నారు. భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే సంస్థగా మారడానికి ఈ విశ్వవిద్యాలయం ఒక దీర్ఘకాలిక దార్శనికతను అభివృద్ధి చేసుకుందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పట్ల, ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన లక్ష్యాల పట్ల దీనికున్న నిబద్ధత, సమ్మిళిత, సమానత్వ అభివృద్ధి పట్ల బాధ్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఒక శ్రేష్ఠతా కేంద్రంగా ఆవిర్భవించి, 2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత సాకారానికి గణనీయంగా దోహదపడుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.




### సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది

పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవం వారి సంవత్సరాల అంకితభావం, పట్టుదల మరియు కఠోర శ్రమకు పరాకాష్ట అని అన్నారు. వారు కలలతో విశ్వవిద్యాలయంలో ప్రవేశించారు, మరియు ఈ రోజు వారు జ్ఞానం, ఆత్మవిశ్వాసం మరియు వారికి కొత్త అవకాశాల తలుపులు తెరిచే డిగ్రీతో బయటకు వెళు తున్నారు. విద్యార్థుల విజయం వారి సొంత కఠోర శ్రమ ఫలితమే అయినప్పటికీ, అది వారి తల్లిదండ్రుల త్యాగాలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమాజ మద్దతుతో కూడా రూపుదిద్దుకుందని రాష్ట్రపతి అన్నారు. అందువల్ల, సమాజానికి తిరిగి సేవ చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. వారు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణలను నడిపించే శాస్త్రవేత్తలుగా, ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా సమాజ సేవ చేసే దాతలుగా మారినా, వారి విద్య అణగారిన వర్గాలకు బలంగా మారాలి. సాంకేతిక పురోగతులు ప్రతి రంగాన్ని మారుస్తున్నాయని రాష్ట్రపతి అన్నారు. ఇంత వేగంగా మారుతున్న ప్రపంచంలో, డిగ్రీ సంపాదించడంతో చదువు ముగిసిపోకూడదు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు నిరంతరం అనుగుణంగా మారే తపన విద్యార్థులకు గొప్ప బలాలలో ఒకటిగా ఉంటుంది. కొత్త ఆలోచనలను అన్వేషించడానికి, కొత్త జ్ఞానాన్ని సంపాదించడానికి ధైర్యాన్ని పెంపొందించు కోవాలని ఆమె వారికి సూచించారు. నేర్చుకోవాలనే తపన, పట్టుదల, నూతన ఆవిష్కరణలు చేసే మన యువత మన అమూల్యమైన జాతీయ సంపద అని రాష్ట్రపతి అన్నారు. తమ జ్ఞానాన్ని సృజనాత్మకత, పట్టుదల, బాధ్యతా భావంతో మేళవించడం ద్వారా, మన యువత సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని, మరింత సమ్మిళిత, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి దోహదపడగలరు. నైతిక విలువలను అలవర్చుకోవడం విద్యార్థులకు ఎంతో సహాయపడుతుందని రాష్ట్రపతి చెప్పారు. నిజాయితీ, కరుణ, సానుభూతి, ప్రకృతి పట్ల గౌరవం అనేవి కేవలం ఉన్నతమైన నైతిక ఆదర్శాలు మాత్రమే కాదని, అవి సంపూర్ణ అభివృద్ధికి పునాదులని ఆమె అన్నారు. ఈ గుణాలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి, సమాజానికి, దేశానికి అర్థవంతంగా తోడ్పడటానికి వీలు కల్పిస్తాయి. మన యువత యొక్క శక్తి, ప్రతిభ, నిబద్ధత ద్వారా మాత్రమే వికసిత భారత్ దార్శనికతను సాకారం చేసుకోగలమని రాష్ట్రపతి అన్నారు. వారు ఏ మార్గాన్ని ఎంచుకున్నా, అంకితభావంతో, నిజాయితీతో శ్రేష్ఠతను సాధించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోల్డ్ మెడల్ సాధించిన కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు గోల్డ్ మెడల్ లను గౌరవ భారత రాష్ట్రపతి బహుకరించారు. అంతకుముందు గౌరవ భారత రాష్ట్రపతి గారిని, రాష్ట్ర గవర్నర్ గారిని, మంత్రి నారా లోకేశ్ గారిని, మంత్రి పయ్యావుల కేశవ్ గారిని ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ.కోరి శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణ్ దుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తాడిపత్రి ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి, ఆయా శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఎప్‌సెట్ 2026 ఫలితాలు విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,76,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా... వారిలో 2,58,545 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,82,317 మంది (70.52 శాతం) విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. అలాగే, అగ్రికల్చర్ అండ్ ఫార్మా విభాగంలో 79,231 మంది దరఖాస్తు చేసుకోగా... 70,929 మంది పరీక్ష రాశారు. ఈ విభాగంలో ఏకంగా 63,546 మంది అంటే 89.59 శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయి మంచి ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.
ఎప్‌సెట్ పరీక్షల్లో టాప్ ర్యాంకర్లు వీరే:
ఇంజినీరింగ్:
జొన్నల రోషన్ మణిదీప్ రెడ్డి – గుంటూరు
కోరుకొండ శ్రావ్య – శ్రీకాకుళం
వెన్న ప్రవీణ్ కుమార్ రెడ్డి – పల్నాడు
తుంగ దుర్గా సుప్రభాత్ – పల్నాడు
తెల్లూరి శ్రేయస్ రెడ్డి – హైదరాబాద్
ముక్కార సాకేత్ – కడప
బండి వెంకట సాత్విక్ – గుంటూరు
నూర్ బాషా హఫీజ్ – గుంటూరు
పసల మోహిత్ – కడప
మరక వంశీధర్ రెడ్డి – కడప.

అగ్రికల్చర్ అండ్ ఫార్మా:
శంబంగి జశ్వంత్ నాయుడు – విజయనగరం
కుడుముల వెంకట మహంత్ అక్షజ్ రెడ్డి – మేడ్చల్ మల్కాజ్‌గిరి
కొండ్రెడ్డి హారికాదేవి శ్రీ అనూహ్య – కృష్ణా
కర్రి సత్యనారాయణ – కాకినాడ
బంటు ధాత్రిక – అనకాపల్లి
పల్లికొండ దర్శ్‌తేజ – కాకినాడ
వల్లెపు ధీరజ్ కృష్ణ – గుంటూరు
దండమూడి జాగృతి – గుంటూరు
ఆళ్ల శ్రీలక్ష్మి సత్యసాయి నిఖితారెడ్డి – పల్నాడు
రేలంగి జయ షణ్ముఖి – విజయనగరం.

# ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ బాధ్యతలు..

'**మొదటిపేజీ తరువాయి**

గార్డ్ ఆఫ్ ఆనర్' స్వీకరించిన అనంతరం ఆయన నేరుగా తన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. మాజీ లెఫ్టినెంట్ జనరల్ అయిన తండ్రి కె.ఎం.సేథ్‌కు సైనిక సెల్యూట్ చేశారు.అంతటితో ఆగకుండా తల్లి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేసింది. మరో విశేషం ఏంటంటే.. భారత నౌకాదళంలో రియర్ అడ్మిరల్‌గా ఉన్న ఆయన సోదరుడు రవ్నీష్ సేథ్ కూడా కొత్త ఆర్మీ చీఫ్‌కు సెల్యూట్ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
అంతకుముందు జనరల్ ధీరజ్ సేథ్ జాతీయ యుద్ధ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళు లర్పించారు. అనంతరం అధికారికంగా ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. దేశ భద్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

# హద్దుమీరితే ఆటకట్టిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తిగత దూషణలు, చంపేస్తామని బెదిరించడం, దేవుళ్లు, దేవతలపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. నిర్మాణాత్మక విమర్శలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని చెప్పారు.
సైబర్ వేధింపులు, పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే చర్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ పేర్కొన్నారు. నేరస్థులకు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
డిప్యూటీ సీఎం కార్యాలయంలో ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బాధితులు ఆధారాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై బీఎన్ఎస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.'నేరస్థులకు, నేరానికి కులం, మతం, రాజకీయ పార్టీలు ఉండవు. తప్పు చేసి...కులం, మతం, ప్రాంతం, రాజకీయాల వెనక దాక్కోలేరు. చట్టం ముందు ప్రతి పౌరుడూ సమానమే. నేరం చేసిన ప్రతి ఒక్కరిపైనా చట్ట ప్రకారం చర్యలుంటాయి. సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ పోరాటంలో వారు ఒంటరులు కాదు. డిప్యూటీ సీఎం కార్యాలయంలో దీనిపై ఫిర్యాదుల వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. స్క్రీన్ షాట్స్, లింక్స్, వీడియోలు లేదా ఏదైనా డిజిటల్ ఆధారాలతో బాధితులు అక్కడ ఫిర్యాదు చేయవచ్చు. అవసరమైతే సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కొత్త చట్టం తెస్తాం" అని ఆయన తెలిపారు.

# పాలనపై చర్చకు సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీ, బోధి పెవిలియన్, ప్రెస్‌క్లబ్, అశోక్‌నగర్ చౌరస్తా ఎక్కడికైనా తానే స్వయంగా వస్తానని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపైనా, రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గణాంకాలతో సహా నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం, మంత్రులు, కాంగ్రెస్ నేతల దోపిడీ వల్లే తెలంగాణ దివాలా తీస్తున్నదని విమర్శించారు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదంటున్న రేవంత్ రెడ్డి, 72 సార్లు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు.
కేసీఆర్ హయాంలో అప్పుల గురించి రేవంత్ రెడ్డి నిత్యం అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2023 వరకు తెలంగాణ అప్పు రూ.3.50 లక్షల కోట్లని పార్లమెంటులో కేంద్రం చెప్పిందన్నారు. ఇందులో ఉమ్మడి రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.72 వేల కోట్లు, కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.2.78 లక్షల కోట్లని వివరించారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి రూ. 8.11 లక్షల కోట్లు అప్పు చేశారంటూ నిత్యం అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అప్పులే కాకుండా రాష్ట్ర ఆదాయంతోపాటు అప్పులకు కడుతున్న వడ్డీ లెక్కలపైనా సీఎం తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. సీఎం చెప్పింది నమ్మాలా?, కాగ్ చెప్పింది నమ్మాలా?అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికే రూ.1.13 లక్షల కోట్లు ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు చెప్పిన ఆర్థిక సహాయం చేయలేదన్నారు. రైతాంగానికి బాకీ పడ్డ రూ.1.13 లక్షల కోట్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఎకరానికీ రైతుభరోసా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారని అన్నారు. రైతాంగానికి, విద్యార్థులకు, మహిళలకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ రాహుల్ గాంధీకి మాత్రం రూ.వెయ్యి కోట్లు ఇస్తానంటూ రేవంత్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు.
ఆ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. డబ్బుల్లేవంటూనే రూ.200 కోట్లతో సీఎం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించుకున్నారని అన్నారు. యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అబద్ధాలు మాట్లాడ్డం ఆపి ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టిపెట్టాలని హితవు పలికారు. రాష్ట్రం గురించి అడ్డగోలుగా మాట్లాడి ప్రజల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని కోరారు. రానున్న రోజుల్లో బాహుబలి సినిమాలో భల్లాల దేవునికి పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. ఆయన నమ్మిన హిట్లర్‌కి ఎలాంటి ముగింపు కలిగిందో అలాంటి ముగింపునే ప్రజలు రేవంత్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇస్తారని అన్నారు. ఆయన అభద్రతాభావంలో ఉన్నారని చెప్పారు. రూ.15 లక్షలు ఇస్తానని మోడీ, రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని రేవంత్‌రెడ్డి మోసం చేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామన్నారు. కృష్ణా, గోదావరి జలాలను గురుదక్షిణ కింద చంద్రబాబుకు అప్పగించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 280 ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రభుత్వం మెట్రో రైల్‌ను స్వాధీనం చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, విప్ కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ రాకేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు

**మొదటిపేజీ తరువాయి**

సిబ్బందికి వేతనాలు జమయ్యాయి.గతంలో జీతాల చెల్లింపులో ఆలస్యం కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజెన్సీ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆర్థిక శాఖ జీతాల చెల్లింపును పూర్తి చేసింది.ఇకపై ప్రతి నెల 25వ తేదీలోగా జీతాల బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగాలకు పంపాలని, నెలలో చివరి పని దినానికల్లా ఆడిట్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్థిక శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిపబ్లిక్

గురువారం 2 జులై 2026

# నంది అవార్డు గ్రహీతకు సన్మానం



**మహానంది, జూలై 1, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రముఖ చెక్కభజన కళాకారుడు పొట్టివాండ్ల విజయభాస్కర్ హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రతిష్మాత్మక సాంస్కృతిక కార్యక్రమంలో నంది అవార్డు అందుకున్నారు. నంది అవార్డు పొందిన పొట్టివాండ్ల విజయభాస్కర్ ని ఎస్సీ కాలనీ ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విజయ్ భాస్కర్ నంది అవార్డు అందుకోవడం హర్షనీయమన్నారు. ఉన్నత స్థానానికి ఎదిగిన మన జాతి బిడ్డలను గౌరవించుకోవడం మన ధర్మం అని అన్నారు. తన ప్రతిభను గుర్తించి అవార్డు అందజేసిన రవీంద్ర భారతి కళావేదిక వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్న ఊరికి,కన్న తల్లికి, జాతి అభివృద్ధికి చేసిన సేవ ఎంతోవిలువనిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహ, వెంకటసుబ్బయ్య, రవికృష్ణ, మోష, నరసింహ, టిడిపి నాయకులు మధు,సాయి, రవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వైద్యుల దినోత్సవం
## ప్రభుత్వ వైద్యులకు లయన్స్ క్లబ్ ఘన సన్మానం



**అనంతపురం/గుత్తి, జూలై 1: (రిపబ్లిక్ న్యూస్)**




ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. యల్లప్ప, డా. పవన్ కుమార్ రెడ్డి, డా. ఐశ్వర్య, డా. రమ్యశ్రీ, డా. శ్రీలేఖ, డా. నిరంజన్, డా. రక్తిమ్‌లను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ప్రతి రోగికి సేవాభావంతో వైద్య సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న వైద్యులను సన్మానించడం తమకు గర్వకారణమని తెలిపారు. డా. యల్లప్ప మాట్లాడుతూ, తమ సేవలను గుర్తించి గౌరవించిన లయన్స్ క్లబ్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. అలాగే, ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుత్తి పోర్ట్ లయన్స్ క్లబ్, గౌతమిపురి సభ్యులు పాల్గొన్నారు.

# వేంపెంట గ్రామంలో స్పౌస్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ



**పాములపాడు జూలై 1 రిపబ్లిక్ న్యూస్:-** పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో స్పౌస్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ సచివాలయ ఉద్యోగస్తులతో, కార్యకర్తలతో కలిసి పాల్గొని, ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెల ఒకటవ తేదీననే పెన్షన్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనది అన్నారు. ఇలాంటి ప్రభుత్వంలో మనం ఉన్నందుకు చాలా గర్వపడాలని ప్రజలు తెలియజేశారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల వలన ఎందరో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, చేనేత కార్మికులకు, కల్లుగీత కార్మికులకు, ఒంటరి మహిళలకు తమ జీవనానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. త్వరలో కొత్త పెన్షన్లు కూడా మంజూరు చేయడానికి మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉత్సాహంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, నెంబర్ లక్ష్మన్న, సుబ్బారావు, హుస్సైనయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026కు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీ సత్య సాయి ప్రతినిధి, జూలై 01, (రిపబ్లిక్ న్యూస్):**



వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ, ధైర్యసాహసాలు ప్రదర్శించిన బాలబాలికలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2026' కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన తెలిపారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, కళలుసంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన బాలబాలికలు ఈ పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. 2026 జూలై 31 నాటికి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన భారతీయ బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ పూర్తి వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను జూలై 20లోగా సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, డోర్ నెం. 28-4-665, బుడ్డప్ప నగర్, అనంతపురం చిరునామాకు సమర్పించాలని సూచించారు.

# అనారోగ్యంతో మృతి చెందిన హెల్పర్ పులికొండ పార్థివదేహానికి నివాళులు అర్పించిన తెలుగుదేశం నాయకులు
## 15 వేలు ఆర్థిక సహాయం అందించిన నాయకులు





**చిప్పగిరి, జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలంలో ఎంపీడీవో ఆఫీస్ లో ఎన్ఆర్ఈజీఎస్ ఆఫీస్ నందు హెల్పర్ గా పనిచేస్తున్న కొక్క పులికొండ అనారోగ్యంతో మరణించినారు. మరణించిన విషయం తెలుసుకున్న ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి వైకుంఠం జ్యోతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ వెంటనే మండల నాయకులకు కర్నూలు జిల్లా జడ్పీటీసీ సంఘం మాజీ అధ్యక్షులు మీనాక్షి నాయుడు , బెల్దోన సహకార సంఘం అధ్యక్షులు కొండా రామాంజనేయులు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు,చిప్పగిరి మండల నాయకులకు గ్రామ నాయకులకు కార్యకర్తలకు ఫోన్ చేసి వారి కుటుంబాన్ని పరామర్శించాలని ఆదేశించడం జరిగిందని,అందరూ కలిసి వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు, వారి కుటుంబానికి 15 వేలు ఆర్థిక సాయం అందించారు, ఈ కార్యక్రమంలో, భోగేష్ స్వామి జనార్దన్ స్వామి కొండా రాము క్లస్టర్ ప్రభాకర్ లక్ష్మినారాయణ, కార్యకర్తలు, పాల్గొనడం జరిగింది.

# చిప్పగిరి లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు



**చిప్పగిరి, జూలై, 1,( రిపబ్లిక్ న్యూస్)**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని చిప్పగిరి గ్రామం బుధవారం నిర్వహించారు,ఆలూరు టిడిపి ఇంచార్జి వైకుంఠం జ్యోతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ ఆదేశాల మేరకుస్థానిక కొండ కాలనీలో బూత్ నెంబర్ 145 లో బూత్ లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సింగల్ విండో చైర్మన్ కొండ రామాంజనేయులు, గ్రామ అధ్యక్షుడు వైకుంఠం వెంకటేశ్వర్లు, మండల క్లస్టర్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, భూత్ ఇంచార్జ్ కొండ రాము, బర్మే లక్ష్మీనారాయణ,దేవక్క గారి జయన్న, జనార్ధన్ స్వామి, భోగేశ్వర స్వామి, బర్మే గోపాల్ , రామయ్య ,వెంకన్న ,నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై టు సూరత్ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

**నంద్యాల ఎంపీ శబరి కి వినతి పత్రం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐ కేఎస్ కల్లూరు సమితి**

**కల్లూరు ప్రతినిధి, జులై 1 (రిపబ్లిక్ న్యూస్)**



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ కల్లూరు మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం రోజు నంద్యాల ఎంపీ శబరిని కలవడం జరిగింది. చెన్నై టు సూరత్ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు చింతల మహేష్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ కల్లూరు మండల కార్యదర్శి బిబి రాముడు ఈ సందర్భంగా వీరు నంద్యాల ఎంపి శబరి తో మాట్లాడుతూ చెన్నై టు సూరత్ హైవే రోడ్డు కొరకు భూములు ఇచ్చిన రైతులు ఇరువైపులా భూములు మిగులు భూములు ఉన్నాయి వాటిలోకి వెళ్లి వ్యవసాయం చేసుకోవడానికి వీలు లేకుండా సిమెంట్ దిమ్మెల్ సెట్ చేశారు. వాటిని తొలగించి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని. లేదంటే ప్రత్యామ్ కింద సర్వీస్ రోడ్ వేయాలి అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించాలని ఈ సందర్భంగా వారు ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి తీసుకెళ్లారు. ఎందుకు మేడం స్పందిస్తూ కలెక్టర్ కి తక్షణమే సూచనలు ఇస్తామని చెప్పారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెదపాడు పందిపాడు లక్ష్మీపురం రైతులు నాయకులు పాల్గొన్నారు.

# విబిజి రాంజీ 125 రోజులు పని దినాలు
## ఓర్వకల్లు మండల ఎంపీడీవో నాగ అనసూయ

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 1 (రిపబ్లిక్ న్యూస్)**



బుధవారం రోజున విబిజి రాంజీ సంబంధించి 125 రోజులు పని దినాలు కల్పించడం జరిగినది అలాగే జూలై ఫస్ట్ అంటే బుధవారంరోజు ఒకటో తారీకు నుండి ఈ యొక్క పథకము అమలు చేయడం జరిగినది, ఇందులో భాగంగా ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామంలో ఫీడర్ ఛానల్ వర్క్ కు భూమి పూజ చేసి స్టార్ట్ చేయడం జరిగింది. అలాగే శ్రామికులతో పని జరిగే ప్రదేశంలోనే గ్రామసభ కండక్ట్ చేసి ఆ గ్రామసభలో ఈ విబిజి రాంజీ ప్రాముఖ్యతను కూడా శ్రామికులకు తెలియపరచడం జరిగినది, ఈ యొక్క అవకాశాన్ని ప్రతి ఒక్క శ్రామికులు వినియోగించుకోవాలని జాబ్ కార్డు ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ ఈ యొక్క స్కీంను వినియోగించుకోవాలని వాళ్లకి అవగాహన కల్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీవో డిప్యూటీ ఎంపీడీవో మరియు ఎఫ్ఏ ఉపాధి శ్రామికులు పంచాయతీ కార్యదర్శి పాల్గొనడం జరిగింది

# అన్నదానానికి విరాళం



**మహానంది, జూలై 1, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది పుణ్యక్షేత్రంలో నిత్యం భక్తుల కోసం అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరాళం అందజేశారు. బుధవారం నంద్యాల పట్టణం పద్మావతి నగర్ కు చెందిన కు పోగుల శివ సుందర్ రెడ్డి ఆలయ పర్యవేక్షకులు సుబ్బారెడ్డి కి రూ.50,116వేలు భక్తితో అందజేశారు. విరాళం అందజేసిన దాతను శేష వస్త్రాంతో సత్కరించి, బాండు, ప్రసాదాలు అందజేశారు.

# పింఛన్లతో ఆర్థిక భరోసా
## : చంద్రమౌళీశ్వర్ రెడ్డి



**మహానంది, జూలై 1, (రిపబ్లిక్ న్యూస్)**
కూటమి ప్రభుత్వం పింఛన్లతో పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ..ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్ నరాల జయ చంద్రారెడ్డి అదికారులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**మహానంది, జూలై 1, (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గోపవరం సొసైటీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.
బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు,బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రత్యేకశ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు ఇర్ఫాన్, శేఖర్, హుస్సేన్ భాష,పాములేటి తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



**అనంతపురం ప్రతినిధి, జూలై 01,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రథమ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం పలికారు.స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్‌టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఎమ్మెల్యే సురేంద్రబాబు పాల్గొన్నారు.అలాగే జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికారు.

# ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదగాలి

## మంత్రి నారా లోకేశ్



**అనంతపురం ప్రతినిధి, జూలై 01, (రిపబ్లిక్ న్యూస్):**
యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర2047' లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు.
యువ పట్టభద్రులు కేవలం డిగ్రీలు పొందిన విద్యార్థులు మాత్రమే కాదని, భవిష్యత్తును నిర్మించే తరం అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి తరానికి ఒక ప్రత్యేక అవకాశం ఉంటుందని, ఈ తరం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను స్వీకరించాలని సూచించారు. వ్యక్తి భవిష్యత్తును అతని నేపథ్యం నిర్ణయించదని, కలలు, కృషి, వ్యక్తిత్వమే విజయాన్ని నిర్ణయిస్తాయని చెప్పారు.భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం లక్షలాది మంది యువతకు స్ఫూర్తిదాయకమని మంత్రి అన్నారు. చిన్న గిరిజన గ్రామంలో జన్మించి ఎన్నో వ్యక్తిగత కష్టాలను అధిగమించి దేశ అత్యున్నత పదవికి చేరుకోవడం ప్రతి విద్యార్థికి ధైర్యం, పట్టుదల, సేవాభావానికి నిదర్శనమన్నారు. ప్రారంభ పరిస్థితులు కాదు.. సంకల్పమే గమ్యాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం చారిత్రాత్మక ఘట్టమని లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో వేలాది మంది పట్టభద్రులైనా, తొలి బ్యాచ్‌కు దక్కిన గౌరవం శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. ప్రతి పట్టభద్రికి, స్వర్ణ పతక విజేతలకు అభినందనలు తెలియజేశారు. మారుతున్న ప్రపంచంలో సాంకేతికతను స్వీకరించి, ఆవిష్కరణలకు నాయకత్వం వహించే వారిదే భవిష్యత్తని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతికత, పరిశోధన, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమల రంగాల్లో యువతకు అపార అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు.అవకాశాల కోసం ఎదురుచూడకుండా వాటిని సృష్టించే వారిగా యువత ఎదగాలని లోకేశ్ సూచించారు. ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని, సంస్థలు స్థాపించి ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదని, కఠినమైన మార్గాన్ని ఎంచుకుని సవాళ్లను అధిగమించే వారే అసాధారణ విజయాలు సాధిస్తారని అన్నారు. స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, జీవితాంతం నేర్చుకునే ప్రయాణానికి ఆరంభమని పేర్కొన్నారు.జీవితంలో కుటుంబానికి, విశ్వవిద్యాలయానికి, దేశానికి గర్వకారణంగా నిలిచే వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ శంకర ఆచార్య, ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ. కోరి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతికి అనంతపురంలో ఘన స్వాగతం

**అనంతపురం ప్రతినిధి, జూలై 01, (రిపబ్లిక్ న్యూస్):**
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం అనంతపురం జిల్లా కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. విశ్వవిద్యాలయం హెలిప్యాడ్ వద్ద రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రపతిని ఆహ్వానించారు. అలాగే కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ. కోరి, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ బి. విష్ణుచరణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు.



# 'జ్ఞాన సీమ'గా సీయూఏపీ ఎదుగుతోంది

## ఉపకులపతి కోరి



**అనంతపురం ప్రతినిధి, జూలై 01, (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (సీయూఏపీ) విద్యా శ్రేష్ఠత, పరిశోధన, నవోన్నతి, సమ్మిళిత అభివృద్ధికి కేంద్రంగా వేగంగా ఎదుగుతోందని ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ. కోరి అన్నారు. విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆయన స్వాగతోపన్యాసంతో పాటు ప్రగతి నివేదికను సమర్పించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ చారిత్రాత్మక వేడుకకు హాజరుకావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. 2020 నుంచి 2026 మధ్యకాలంలో పట్టభద్రులైన మొత్తం 1,268 మంది విద్యార్థులకు డిగ్రీలు, వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 56 మందికి స్వర్ణ పతకాలు, అందులో 8 మందికి ఎండౌమెంట్ స్వర్ణ పతకాలు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు.

**విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం ప్రముఖ విద్యాసంస్థలు**
2018లో ప్రారంభమైన విశ్వవిద్యాలయం జాతీయ విద్యా విధానం2020, వికసిత్ భారత్2047 లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జంతలూరు వద్ద 491 ఎకరాల్లో శాశ్వత ప్రాంగణాన్ని ఏర్పాటు చేయగా, కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి రూ.711 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తొలి దశ పనులు రూ.350 కోట్లతో పూర్తయ్యాయని వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో స్మార్ట్ మౌలిక వసతులు, డిజిటల్ పరీక్షా విధానం, కృత్రిమ మేధస్సు, భారతీయ జ్ఞాన పరంపర ఆధారిత విద్యా కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుతం 26 రాష్ట్రాలకు చెందిన 1,472 మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు.
పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ అధ్యాపకులు రూ.3.26 కోట్ల విలువైన ప్రాజెక్టులను సాధించారని, 400కుపైగా పరిశోధనా వ్యాసాలు ప్రచురించడంతో పాటు 24 పేటెంట్లు నమోదు చేశారని వెల్లడించారు. మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా దేశవ్యాప్తంగా 1,076 మంది అధ్యాపకులకు శిక్షణ అందించామని, స్వయంఎన్ పి టెల్ లోకల్ చాప్టర్‌గా 'ఎ' గ్రేడ్ గుర్తింపు పొందినట్లు తెలిపారు.విద్యార్థుల ఉపాధి అవకాశాల కోసం ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా సివిల్ సర్వీసెస్ శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే విశ్వవిద్యాలయంగా సీయూఏపీని తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని ఉపకులపతి కోరి తెలిపారు.

# విలువలతో కూడిన విద్యే వికసిత్ భారత్‌కు పునాది

## గవర్నర్ అబ్దుల్ నజీర్



**అనంతపురం ప్రతినిధి, జూలై 1 (రిపబ్లిక్ న్యూస్):**
విలువల ఆధారిత విద్య, బహుళ విభాగాల అభ్యాసం, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలే వికసిత్ భారత్2047 లక్ష్య సాధనకు బలమైన పునాదిగా నిలుస్తాయని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో బుధవారం ఆయన ప్రసంగించారు.

**రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది**
ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయ మైలురాయిగా నిలుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిందన్నారు. రాయలసీమ చారిత్రక, సాంస్కృతిక, విద్యా వైభవానికి ఈ విద్యాసంస్థ మరింత గుర్తింపు తీసుకువస్తుందని తెలిపారు. అనంతపురం ఇప్పటికే ప్రముఖ విద్యా కేంద్రంగా ఎదిగిందని, ఈ నేపథ్యంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం స్థాపన రాష్ట్ర ఉన్నత విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా వినూత్న విద్యా కార్యక్రమాలను రూపొందిస్తూ భవిష్యత్తులో విశ్వవిద్యాలయం వేగంగా అభివృద్ధి చెందుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.విలువలతో కూడిన విద్య, అనుభవాధారిత బోధన, బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దే విధానాలను విశ్వవిద్యాలయం అమలు చేయడం అభినందనీయమన్నారు. పరిశ్రమలతో భాగస్వామ్యం పెంచుకుని, స్వల్ప, దీర్ఘకాలిక నైపుణ్య కోర్సులు, ఉపాధి ఆధారిత బహుళ విభాగాల విద్యా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.

**దేశ ఆర్థికాభివృద్ధికి విశ్వవిద్యాలయాలు దోహదపడాలి**
జాతీయ విద్యా విధానం2020 విద్యార్థులకు బహుళ విభాగాల విద్యను అందిస్తూ విమర్శనాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తోందన్నారు. ఎంపిక ఆధారిత క్రెడిట్ విధానం, బహుళ ప్రవేశనిష్క్రమణ అవకాశాలు విద్యార్థుల అభ్యాసానికి మరింత వెసులుబాటు కల్పిస్తున్నాయని వివరించారు. ఆత్మనిర్భర్ భారత్ వికసిత్ భారత్2047 లక్ష్యాల సాధనలో ఉన్నత విద్యాసంస్థల పాత్ర కీలకమని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి విశ్వవిద్యాలయాలు దోహదపడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు ప్రేరణ స్నాతకోత్సవం విద్యకు ముగింపు కాదని, జీవితంలో కొత్త అధ్యాయానికి ఆరంభమని గవర్నర్ పేర్కొన్నారు. నిరంతరం నేర్చుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సూక్తిని ఉటంకిస్తూ'నేను చేయలేను' అని ఎప్పుడూ అనవద్దు... మీలో అనంతమైన శక్తి ఉంది" అని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు.తల్లిదండ్రుల త్యాగం, ప్రేమ, ప్రోత్సాహమే విద్యార్థుల విజయాలకు పునాదిగా నిలిచిందని కొనియాడిన గవర్నర్, పట్టభద్రులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి ఆహ్వానించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.ఎ. కోరికి కృతజ్ఞతలు తెలిపారు.









# సర్ పనితీరును పరిశీలించిన రామిరెడ్డి ధ్వజ రెడ్డి.

**రైల్వే కోడూరు జూలై 1 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు మండలం ఎస్ కొత్తపల్లి పంచాయతీ జానకిపురంలో బుధవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వైయస్సార్సీపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, రైల్వే కోడూరు వైఎస్ఆర్సిపి పార్టీ మండల అధ్యక్షులు, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి పరిశీలించారు.
ప్రజలందరూ సర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని బి ఎల్ ఓ లు, బి ఎల్ ఎ ల దగ్గర తమ ఎన్యూమరేషన్ ఫారాల ను తీసుకోవాలని సూచించారు.
అనంతరం ఫారమ్‌లో అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి, నిర్ణీత గడువులోగా బి ఎల్ ఓ లకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తద్వారా ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మెంబర్ వైయస్ అన్వర్ భాష , సీనియర్ నాయకులు కౌరెడ్డి సిద్దయ్య, మాజీ ఎంపీటీసీ ఆనంద్ యాదవ్,స్థానిక



సర్పంచ్ శైలజ, దార్ల చంద్రశేఖర్ , చెంగల్ రెడ్డి, మాజీ సర్పంచి ఆర్ వి రమణ, గోపి, సుబ్రహ్మణ్యం రాజు, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి కృష్ణారెడ్డి , బత్తల సుబ్రహ్మణ్యం, ప్రసాద్, మైనార్టీ నాయకులు అబ్దుల్ సలామ్, శివయ్య, అనంతరాజుపేట మణి, అనంతరాజుపేట షఫీ, కంభం శ్రీనివాసులు రెడ్డి, కుంచం హరి, శివ కుమార్ రాజు,సంటి నాగరాజు, లక్ష్మీపతి పవన్ రెడ్డి, మరియు గ్రామస్తులు పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఓబునపల్లె



పంచాయతీ ఓపనపల్లె దళితవాడలో 56 57 యూత్ ఏరియాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ ఓ లతో కలిసి ఓటర్లకు పంపిణీ చేయడం జరిగినది, పత్రాల పంపిణీ అనంతరం రామిరెడ్డి గిరి రెడ్డి స్థానికులతో మాట్లాడుతూ ఎన్యుమరేషన్ పత్రాలను సక్రమముగా నింపి సకాలంలో బిఎల్ఓ లకు అందజేయాలన్నారు అనుమానాలు ఏమైనా ఉంటే అధికారులతో సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**అనంతపురం/గుత్తి, జూలై 01: (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి పట్టణంలో బుధవారం నిర్వహించిన సంక్షేమ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర అర్హులైన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సదుపాయాలను సకాలంలో అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా, వివిధ కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతులకు సీఎం



రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అవసరమైన ప్రతి అర్హుడికి సహాయం చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు కేవలం పథకాలుగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా అమలు అవుతున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి



ప్రభుత్వ సహాయం చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, గుత్తి పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడు లక్ష్మీ రంగయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, కేశవ నాయుడు, న్యాయవాది సోమశేఖర్, రైటర్ రామకృష్ణ, ఎస్.ఎం.భాష, కోనంకి కృష్ణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏ.కోడూరు సహకార సంఘంలో ఘనంగా వారోత్సవాలు

## ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటుచేసి రైతులకు వైద్య పరీక్షలు





**బండి ఆత్మకూరు,జూలై 0 1, (రిపబ్లిక్ న్యూస్):-**

సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నంద్యాల బ్రాంచ్ పరిధిలో ఉన్న ఏ.కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వారోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సహకార సే సమృద్ధి కార్యక్రమానికి సహకార బ్యాంకు నంద్యాల జీఎం శివలీల, నంద్యాల బ్రాంచ్ మేనేజర్ హుస్సేన్ భాష, ఆప్కాబ్ డిపిడిఎం రంగనాథ్, నాబార్డ్ డిడిఎం కార్తీక్, డివిజినల్ సహకార అధికారి రుక్షానా బేగం, సబ్ డివిజన్ కోఆపరేటివ్ ఆఫీసర్ సుబ్బలక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సహకార సంఘం వారోత్సవాల్లో భాగంగా సొసైటీ ఆధ్వర్యంలో వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రైతులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం బలోపేతం కోసం అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల అభివృద్ధి సంక్షేమంతో పాటు హరిత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కో ఆపరేటివ్ వీక్ సహకార సమృద్ధి సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. అలాగే సహకార సంఘం ద్వారా అందించే సేవల గురించి వివరించారు. నంద్యాల మెయిన్ బ్రాంచ్ ద్వారా సీనియార్టీ ప్రాతిపదికన ఒక లక్ష నుండి 20 లక్షల వరకు పొదుపు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సహకార సంఘం ఖాతాదారుల కోసం మనీ ట్రాన్స్ఫర్ కొరకు ఆర్టిజిఎస్ లెఫ్ట్ వంటి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా యోజన కింద రూ.436 వార్షిక ప్రీమియం చెల్లించి భీమా చేసుకున్న 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల లోపు ఉన్న ఖాతాదారులకు బీమా వర్తిస్తుందన్నారు. ఈ భీమా సాధారణ మరణానికి కూడా వర్తిస్తుందన్నారు. బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీతో కేవలం 10 నిమిషాల్లోనే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. వీటితోపాటు వాహన రుణాలు , పిల్లల ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తోపాటు దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం అధికారులందరూ సొసైటీ ఆవరణలో సహకార సంఘం సభ్యులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, పక్రుద్దిన్,సంధానీ భాష, సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కే .శ్రీనివాసులు డైరెక్టర్ నాగేశ్వరరావు సిబ్బంది కాశీం, అశోక్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల పేరుతో ఉపాధి పనికి ఉరి

## వి బి జి గ్రామ్ జి ను రద్దు చేయాలి... పాత పద్ధతిలోనే ఉపాధి పని కల్పించాలి...

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్

**దేవనకొండ జూలై 1 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**

గ్రామీణ ప్రాంత పేదలకు ఆర్థికంగా భరోసాగా ఉంటున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఉరివేసి చర్యలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని చట్టాన్ని పేరు మార్చే కాకుండా నిబంధనల పేరుతో ఉపాధికి తూట్లు పడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ పేర్కొన్నారు..

వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత కమిటీ పిలుపుమేరకు విబిజీ గ్రాంజీని రద్దు చేయాలని పాత పద్ధతిలోనే పని కల్పించాలని పని ప్రదేశాల్లో మౌలిక వసతులు వేతనం పెంపు తదితర సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘానికి పిలుపుమేరకు దేవనకొండ మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షులు మహబూబ్ బాషా అధ్యక్షతన ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ
ఉపాధి హామీ కూలీలను ఫేస్ యాప్ పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఫేస్ యాప్ ను రద్దు చేయాలని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలినీ , చేసిన పనికి పే స్లిప్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ను వివిధ రకాల మార్పులతో, పని దినాలు పెంచుతున్నామని సాకుతో విబిజీ గ్రామ్ జి గా పేరు మార్చి గ్రామీణ ఉపాధి



హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుంది ఇప్పటికే నిధులు తగ్గించిన నేపథ్యంలో కూలీలకు అన్యాయం జరుగుతుంది ఈ నేపథ్యంలో మరిన్ని నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా పేరుతో గ్రామీణ ఉపాధి హామీని గొంతు కోసే ప్రయత్నం జరుగుతుంది కావున పాత పద్ధతుల్లోని ఉపాధి పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు, వేసవిలో వ్యవసాయ పనులు లేని సమయంలో ప్రతి కుటుంబానికి పని కల్పించి, వలసలు అరికట్టేందుకు తెచ్చిన చట్టం. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఉపాధి హామీ చట్టం లో అనేక రకాల మార్పులు తెచ్చింది, రెండు పూటల పనులు, రెండుపూటల పేస్ యాప్ ఎందుకోసం? కొలతల ప్రకారం పనులు చేస్తున్నారు ఎంత కొలతల కు అంత వేతనం వస్తుంది మరి ఎందుకు పేస్ యాప్. కనుక వెంటనే పేస్ యాప్ ఎత్తివేయాలనీ ఉదయం పూట మాత్రమే పనులు కల్పించాలనీ, అడిగిన వారందరికీ పనులు కల్పించాలినీ, పనిచేసిన వారంలోగా వేతనాలు ఇవ్వాలని, పనిప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలినీ ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా చేసిన పని కి సంబంధించి పేస్లిప్ప ఇవ్వాలని ఉపాధిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ఉపాధి నిర్వహణకు సంబంధించి స్థానిక సంస్థలకే అధికారాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు... ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు యూసుఫ్ భాష సిఐటియు నాయకులు సుధాకర్ డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మహేంద్ర, ఉపాధి కూలీలు లక్ష్మీదేవి సుభద్రమ్మ సుజాత రాజేశ్వరి అదే విధంగా రామకృష్ణ మల్లికార్జున వెంకటేశ్వర్లు ఆంజనేయులు పాల్గొన్నారు మండలంలోని కుంకనూరు, పాలకుర్తి ,తెర్నేకల్ గ్రామ సచివాలయల ముందు కూడా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఆయా సచివాలయ బాధ్యులకు వినతిపత్రం అందజేశారు

# పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మైనారిటీ మాజీ అధ్యక్షులు గుజిరి ఖాజా...

**గుంతకల్ ప్రతినిధి జులై 01 ( రిపబ్లిక్ న్యూస్)**

గుంతకల్లు లోని 22 వ వార్డ్ నందు యమ్ ఎల్ ఎ గుమ్మనూరు జయరాం అన్న మరియు గుమ్మనూరు నారాయణస్వామి అన్న ఆదేశాల మేరకు 22 వ వార్డ్ ఇన్చార్జి. Ex కౌన్సిలర్, గుంతకల్ పట్టణ ఉపాధ్యక్షురాలు గుత్తి యాస్మిన్, Ex జిల్లా మైనారిటీ ఆధ్యక్షులు గుజిరి మహమ్మద్ ఖాజా, కె వలి భాష , వి.రహంతుల్లా, గుజిరి సేపుల్ల, కొలిమి రామాంజనేయులు,గుజిరి సురేష్, మజహర్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండే సచివాలయం సిబ్బంది అధికారులుతో పెన్షన్ పంపిణీ చేయడం జరిగినది ఇందులో కుటమి సభ్యులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**అనంతపురం/గుత్తి జూలై 01: (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి ఆర్ఎస్ రెండో వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, అరవింద్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను పంపిణీ చేశారు. ఈ



సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్ వారి జీవనోపాధికి ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# వేధింపులకు గురై ఆత్మహత్యాయత్నం చేసిన పెద్ద హోతూరు అంగన్వాడీ టీచర్ కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్లా బొజ్జమ్మ





**దేవనకొండ జూలై 1 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** కర్నూలు జిల్లా పెద్ద హోతూరు గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ వేధింపులకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నేపథ్యంలో, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కప్పట్రాల్లా బొజ్జమ్మ బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు.
ఈ సందర్భంగా బాధితురాలితో మాట్లాడిన బొజ్జమ్మ గారు, జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. బాధితురాలు మాట్లాడుతూ, స్థానిక నాయకుడు వీరేష్ నుంచి చాలా కాలంగా వేధింపులు ఎదుర్కొంటున్నానని ఆరోపించింది. ఈ సందర్భంగా కప్పట్రాల్లా బొజ్జమ్మ మాట్లాడుతూ, "నువ్వు అధైర్యపడవద్దు. మహిళల రక్షణకు కట్టుబడి ఉన్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, యువనేత శ్రీ నారా లోకేష్ గారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాను. ఈ ఘటన వెనుక ఎవరున్నా పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, నీకు న్యాయం జరిగే వరకు నేను అండగా ఉంటాను" అని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. బాధిత మహిళకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు .

# ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

## -- ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన శుభాకాంక్షలు తెలిపిన వైద్యులు

**ఎమ్మిగనూరు, జూలై, 1, ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):**ఎమ్మిగనూరులోని వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులకు వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అమూల్యమైనవని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడేందుకు రాత్రింబవళ్లు అంకితభావంతో సేవలందిస్తున్న ప్రతి వైద్యుడు సమాజానికి నిజమైన



సేవకుడని కొనియాడారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడంలో, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. వైద్య వృత్తిని సేవా ధర్మంగా భావించి ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ప్రతి వైద్యుడికి ఆయన ప్రత్యేక అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ మాలకొండయ్య డాక్టర్ ఎం.డి. ఫయాజుద్దీన్ , డాక్టర్ ఏ. వంశీ కృష్ణ డాక్టర్ కె. కార్తీక్ డాక్టర్ జి. శిల్పా డాక్టర్ మనోజ్ కుమార్ , డాక్టర్ రాం పవన్ సింగ్ డాక్టర్ సేతురాం కర్ణం తదితర ప్రముఖ వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కాటిపేరిలో ఘనంగా గంగ జాతర

**చౌడేపల్లి ప్రతినిధి**
**జూలై 01 రిపబ్లిక్ న్యూస్**

మండలంలోని కాటిపేరి పంచాయతీలు బుధవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు పంచాయతీలోని ఏడు గ్రామాల్లోనూ ఉత్సవాలు నిర్వహించారు. గ్రామదేవతలకు పొంగళ్ళు పెట్టి మహిళలందరూ దీపారాధన చేశారు గరిగతో అమ్మవారి చెంతకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు రెండు



రోజులపాటు జరిగిన ఈ జాతరలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు గ్రామానికి చేరుకున్నారు సొంత ఊర్లో విడచి పొట్టకూటి కోసం బయట ప్రాంతాలకు వెళ్లిన వారి సైతం గ్రామానికి చేరుకోవడంతో పల్లెలన్నీ నిండిపోయాయి ఈ మేరకు కులమత బేధాలు లేకుండా అందరూ సహపంతి భోజనాలు చేశారు పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా బాబు రెడ్డి అదే విధంగా సీనియర్ నాయకులు మాదిరాజు లక్ష్మణరాజు (పతిరాజు) మాదిరాజు ప్రదీప్ రాజులు అమ్మ వాళ్లకు విశేష పూజలు చేసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.2023/87888



# వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

## జిల్లేడుబుడకల గ్రామంలో లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసిన రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

**దేవనకొండ, జూలై 1( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలం జిల్లేడుబుడకల గ్రామంలో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పాల్గొని వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పింఛన్ సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల జీవనోపాధికి





ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఎంతో తోడ్పాటునిస్తున్నాయని ఆమె అన్నారు. గ్రామాల్లోనే ఇంటి వద్దకు పింఛన్లు అందించడం ద్వారా లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అమినిగుంట స్వర్ణ గ్రామంలో 'వికసిత్ భారత్' గ్రామసభ




**చౌడేపల్లి ప్రతినిధి జూలై 01 రిపబ్లిక్ న్యూస్** మండలంలోని పంచాయితీ కేంద్రం అమినిగుంట స్వర్ణ గ్రామంలో బుధవారం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)' పథకంపై గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.ఎ. గఫూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి జీవనోపాధిని పెంపొందించడానికి ఈ మిషన్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ గ్రామ సభలో అమినిగుంట పంచాయతీ అభివృద్ధి అధికారి ఎల్. అమరనాథ్, పందిళ్ళపల్లి పీడీఓ ఎస్. మోహన్, స్థానిక సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# 125 రోజుల కూలి పని దినాలని సద్వినియోగం చేసుకోండి





### టిడిపి సీనియర్ నేత కప్పట్రాళ్ల మల్లికార్జున

**దేవనకొండ జూలై 1( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
మండల పరిధిలోని కప్పట్రాళ్ల గ్రామం నందు బుధవారం నాడు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్‌జీ రామ్ జీ పథకం ప్రారంభించిన తొలి రోజు సందర్భంగా రైతు లక్ష్మన్న పొలంలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నేత కప్పట్రాళ్ల మల్లికార్జున హాజరై మొక్కలు నాటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్‌జీ రామ్ జీ పథకం కింద చేపట్టే మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ కూలీల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గతంలో ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచడం వల్ల గ్రామీణ పేద కుటుంబాలకు మరింత ఉపాధి, ఆదాయం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, గ్రామీణ పొలాల రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధితో పాటు కూలీలు, రైతుల జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటి ప్రయోజనాలను పొందాలని మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు, సురేంద్ర నాయుడు, పెద్ద కౌలుట్లయ్య, పాపన్న, ఎర్రకోరుట్ల, బింగి మునిస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ నాగన్న ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున కార్యకర్తలు, గ్రామ రైతులు,కూలీలు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.సి. రాయ్ విగ్రహావిష్కరణ



**అనంతపురం వైద్యం, జూలై 01,(రిపబ్లిక్ న్యూస్)**



జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో ప్రముఖ వైద్యుడు బిధాన్ చంద్ర రాయ్ (డాక్టర్ బి.సి. రాయ్) కాంస్య విగ్రహాన్ని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్ ఆవిష్కరించారు. ఆయన కుమారుడు డాక్టర్ అల్తాఫ్ అక్బర్ రూ.3 లక్షల వ్యయంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఎం. విజయశ్రీ మాట్లాడుతూ డాక్టర్ బి.సి. రాయ్ సేవలు వైద్యులకు ఆదర్శప్రాయమని అన్నారు. ప్రతి ఏడాది జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా విగ్రహం వద్ద నివాళులర్పించడం ద్వారా యువ వైద్యుల్లో సేవాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. సమాజం కోసం చేసే సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన డాక్టర్ అల్తాఫ్ అక్బర్‌ను అభినందించారు.
డాక్టర్ అక్బర్ సాహెబ్ మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలందించిన డాక్టర్ బి.సి. రాయ్ విగ్రహాన్ని కళాశాలలో ఏర్పాటు చేయడం తమ కుటుంబానికి గర్వకారణమని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ అల్తాఫ్ అక్బర్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఆప్తల్మాలజీ విభాగంలో గోల్డ్ మెడల్ అందజేస్తున్నామని, భవిష్యత్తులో కూడా వైద్య విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, సీనియర్ వైద్యులు, అధ్యాపకులు, పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులు, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

**అనంతపురం ప్రతినిధి, జూలై 01, (రిపబ్లిక్ న్యూస్):**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు క్రమశిక్షణ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్–2026 కార్యక్రమం ఉద్దేశం, కార్యాచరణ షెడ్యూల్, ఇంటింటి ధ్రువీకరణ, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలను వివరించారు.

**ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం**

జిల్లాలో మొత్తం 20,38,523 మంది తుది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 19,88,575 మందికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటిలో 5,01,825 ఫారాలను డిజిటల్‌గా అప్‌లోడ్ చేశామని, మిగిలిన ప్రక్రియను రానున్న 12 రోజుల్లో





పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.
ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు సహకరించాలని కోరిన కలెక్టర్.. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌వోలు విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న డిజిటైజేషన్ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు 'బుక్ ఎ కాల్ విత్ బీఎల్‌ఓ' సేవను వినియోగించుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కొంతమంది బీఎల్‌వోలు ఇంటింటి సందర్శనలు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణలో బీఎల్‌ఏలను కూడా భాగస్వామ్యం చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ కనకరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**బీఎల్‌వో సస్పెన్షన్**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో విధుల్లో అలసత్వం ప్రదర్శించి, ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన అనంతపురం అర్బన్ పోలింగ్ బూత్ నంబర్–27 బీఎల్‌వో జి. కవితను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# కృష్ణలంక ఘటనపై మాజీ ఎమ్మెల్సీ జూపూడి పరామర్శ

## ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**విజయవాడ ప్రతినిధి జూలై 01,(రిపబ్లిక్ న్యూస్):**
విజయవాడలో ఇటీవల చోటుచేసుకున్న క్రాంతి కుమార్ మృతి ఘటన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర రావు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు కుమారుడు క్రాంతి కుమార్ ఇటీవల కృష్ణలంక పోలీసుల వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో విడుదల చేసిన అనంతరం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూపూడి ప్రభాకరరావు మృతుడి నివాసానికి వెళ్లి క్రాంతి కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు దాసి కెనడీ, ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, దాసరి జిన్నీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ నాయకుడు రేవ. దాదాల గిరి, ఇతర పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.




# అట్టహాసంగా వైసీపీ నేత రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు

## 'అనంత ' లో భారీ బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరాలు - అన్నదానాలు, పండ్లు పంపిణీ కార్యక్రమాలు







**అనంతపురం సంక్షేమం, జులై 01,(రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బీసీ నేత రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. రమేష్ గౌడ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించారు. బీసీ రమేష్ గౌడ్ అందుబాటులో లేకపోయినా.. ఆయన అభిమానులు, వైసీపీ శ్రేణులు, యువకులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతపురం నగరంలోని ఏ7 కన్వర్షన్ హాలులో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రమేష్ గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

**జగన్, రమేష్ గౌడ్ చిత్రపటంతో అభిమానులు ర్యాలీ**

రమేష్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని యువత భారీ బైక్ ర్యాలీని నిర్వహించింది. వందలాది బైక్‌లతో యువకులు జై జగన్, జై రమేష్ గౌడ్ అంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీ నగరంలో పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చింది. జగన్, రమేష్ గౌడ్ చిత్రపటంతో అభిమానులు ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లాపరిషత్‌లోని దివంగత నేత వైఎసఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు యువత రక్తదానం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పేదలకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలలో రోగులకు, వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి రమేష్ గౌడ్‌పై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే అనంతపురంతోపాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం, ధర్మవరం, హిందూపురం తదితర ప్రాంతాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రమేష్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. ఆయా ప్రదేశాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**మీరిచ్చిన ఈ ఉత్సాహంతో భవిష్యత్తులో ప్రజాసేవలు చేపడతాం**

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు వి.బి.భాస్కర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవకుమార్, నగర అధ్యక్షులు భరత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కురుగుంట మనోజ్ కుమార్, రాజశేఖర్ కురువ, ప్రవీణ్, శైలేష్, చరణ్, ఈడిగ సంఘం పెద్దలు పాలచర్ల ఆదినారాయణప్ప, ఈడిగ సంఘం జిల్లా అధ్యక్షులు సురేంద్ర కుమార్ గౌడ్, రేణుక ఎల్లమ్మ సొసైటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, రామ్మోహన్ గౌడ్, శ్యాంబాబు, నక్కల చంద్ర, నమల్లికార్జున, ఈశ్వరయ్య, శివానంద, చిన్నరాయుడు, బలరాముడు, వరుణ్, మధు, ఎస్సీ జనసంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు దాసగానిపల్లి కుళ్లాయప్ప, సాకే కుళ్లాయప్ప, రాంప్రసాద్, నిడిగల్లు ధను, మేకల రమేష్, పెద్దన్న, సాయి, వైసీపీ నాయకులు లబ్బే రాఘవ, తాడిమర్రి నరేంద్ర, అంకె తేజ, హేమ కిరణ్, చంద్రశేఖర్ యాదవ్, సిద్దు, మోహన్, గణేష్, వంశి, బాలాజీ, ఇమ్రాన్, సుహేల్, దూదు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ అందుబాటులో లేకపోయినప్పటికీ.. ఫోన్ ద్వారా మాట్లాడారు. తనపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపిస్తున్న వైసీపీ కుటుంబ సభ్యులకు, యువతకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మీరిచ్చిన ఈ ఉత్సాహంతో భవిష్యత్తులో ప్రజాసేవలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్**




**జహీరాబాద్ ప్రతినిధి జూలై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు నిర్మించాలని నూతన క్లాస్ రూమ్ లో ఏర్పాటు చేయాలని సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో అందజేయాలని ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వ బాయ్స్ స్కూల్ నుండి ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డిఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి ఇస్మాయిల్ ఈ గోపాల్ సంయుక్తంగా మాట్లాడుతూ రాష్ట్రాలు మారిన ప్రభుత్వాలు మారిన విద్యార్థుల తలరాతలు ఏ మాత్రం మారడం లేదు విద్యార్థులు ఎదుర్కొన్న ఎదుర్కొంటున్న సమస్యల పైన ఏ ఒక్కరు నోరు తెరవడం లేదు కనీసం చెప్పుకున్న నాధుడు లేడు ప్రభుత్వమేరు పడి రెండున్నర సంవత్సరాలు గడిచిపోయిన ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి పెట్టకపోవడం సిగ్గుచేటు ఒకపక్క విద్యార్థులకు ఎప్పుడో కట్టిన బిల్డింగులు ఎప్పుడు కులుతాయో తెలియని పరిస్థితిలో అదేవిధంగా విద్యార్థుల కనీసం ఇప్పటివరకు యూనిఫామ్ పుస్తకాలు సబ్జెక్టు సరిపడి టీచర్స్ సరైన వాష్ రూమ్ స్కావెంజర్ స్లిప్పర్స్ లేక విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలలో నానా ఇబ్బందులు పడతా ఉన్నారు అయినా పట్టించుకోవడం లేదు ఈ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్టు వివరించడం సరైన తీరు కాదు ఇప్పటికైనా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బ్రేక్ఫాస్ట్ మీ లుక్కు పథకాన్ని పాఠశాలలు అందే విధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి ముఖ్యంగా విద్యార్థుల సంఖ్య కనుగుణంగా బాత్రూంలో నిర్మించాలని అన్నారు లేనిపక్షంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ నాయకులు అనిరుద్. రాకేష్. సలోదిన్. పవన్. పవన్ రాజ్. చిన్న. శైలజ. అశ్విని. మౌనిక. తదితరులు పాల్గొన్నారు

# ఆర్డీవో ను కలిసిన బి ఆర్ ఎస్ నాయకులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
జోగిపేట అర్.డి.ఓ.గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన రాజకీయ నేతలు బి ఆర్ ఎస్ నాయకులు చాపల వెంకటేశం, కరుణాకర్, రఫిక్ అహ్మద్, బిజెపి నాయకులు నవాబు గారి భూమయ్య, శివ శంకర్ ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ ఇపుడు జరుగుతున్న సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమం లో అన్ని రాజకీపార్టీల నాయకులు చురుకుగా పాల్గొని ఎస్ ఐ ఆర్ కార్యక్రమం సజావుగా పూర్తి అవ్వడానికి సహకరించాలని కోరారు.

# జోగిపేటలో 13వ వార్డులో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం



**అందోల్ నియోజకవర్గం ప్రతి నిధి జూలై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈరోజు అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో 13వ వార్డులో ఎస్ ఐ ఆర్ బూత్ లెవల్ ఓటర్ లిస్ట్ ప్రక్రియ మొదలయ్యింది బి ఎల్ ఓ స్వప్న గారు ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి ఇంటి నెంబర్ ఆధారంగా ఓ టు హక్కు కలిగి ఉన్న అలాగే చేర్పులు మార్పులు చనిపోయినవారి ఓటు డబల్ వచ్చిన వారి ఓటు 2002 ఓటరు లిస్ట్ ఆధారంగా తీసుకొని అందులో ఓటు హక్కు కలిగి ఉన్నవారికి లేని వారికీ కచ్చితంగా ఫాహమ్ నింపాల్సిన అవసరం ఉంది ప్రతి ఒక్కరూ కొత్త ఓటు వచ్చినవారు కొత్త గా ఫామ్ నింపాల్సిన అవసరం ఉంది ఈ కార్యక్రమం లో 13 వ వార్డ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి ఎల్ ఏ అల్లె యాదగిరి గారు మరియు బి ఎల్ ఓ స్వప్న గారు కాలనీవాసులు పాల్గొన్నారు

# జోగిపేట్ 15వ వార్డులో నేడు గంధం సమర్పించే కార్యక్రమం

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆందోల్ జోగిపేట మున్సిపల్ 15 వ వార్డు పరిధిలో విశేషమైన వంటి దర్గా ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులు పవిత్ర మైన ఆ దర్గాకు రేపు గంధం సమర్పించడం అలాగే శుక్రవారం రోజున నైవేద్యం సమర్పించడం జరుగుతుంది కాబట్టి ఈరోజు మున్సిపల్ సిబ్బంది తో దర్గా లోపల చుట్టూ ముట్టు పిచ్చిమొక్కలు తీసివేయడం అలాగే ముందు ఉన్న రోడ్లను శుభ్రంగా చేపియడం జరిగింది శానిటేషన్ శ్రీకాంత్ సిబ్బంది కి చెప్పగానే వెంటనే స్పందించడం జరిగింది సిబ్బందికి ధన్యవాదములు




# భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి

## సుల్తాన్ బజార్ శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాష నిలయం లో ఘనంగా

**హైదరాబాద్ ప్రతినిధి జులై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు డా. కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి సభకు అధ్యక్షత వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డా. వి. కిషన్‌రావు గౌరవ అతిథిగా పాల్గొనగా, భారతరత్న పి.వి. నరసింహారావు కుమారుడు శ్రీ పి.వి. ప్రభాకర్‌రావు ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా డా. కె. కేశవరావు మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు భారత ఆర్థిక పునరుజ్జీవనానికి శిల్పి అని కొనియాడారు. 1991లో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఆయన దూరదృష్టి, ధైర్యవంతమైన ఆర్థిక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక రంగంలో గౌరవనీయమైన స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన సంస్కరణలు నేటికీ దేశ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన డా. కె.వి. రమణాచారి (విశ్రాంత ఐఏఎస్) మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు అసాధారణ రాజనీతిజ్ఞుడు, గొప్ప పండితుడు, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త, దూరదృష్టి కలిగిన సంస్కరణవాది అని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో నిజాయితీ, పారదర్శకత, ప్రజాస్వామ్య విలువలను ఆయన అత్యున్నత స్థాయిలో పాటించారని, అందువల్ల భారత చరిత్రలోనే కాకుండా తెలుగు ప్రజల




హృదయాల్లోనూ చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. గౌరవ అతిథి డా. వి. కిషన్‌రావు మాట్లాడుతూ, విద్య, పరిశోధన, సాహిత్యం, భాషల అభివృద్ధికి పి.వి. నరసింహారావు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. భారతీయ, విదేశీ భాషలపై ఆయనకు ఉన్న అపారమైన పట్టు ఆయన మేధస్సుకు, నిరంతర అధ్యయనానికి నిదర్శనమని పేర్కొంటూ, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని జ్ఞాన సాధనలో ముందుకు సాగి పిలుపునిచ్చారు.

ప్రత్యేక అతిథి శ్రీ పి.వి. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ, తన తండ్రి జ్ఞానాన్నే మనిషి సంపాదించగల అత్యంత విలువైన సంపదగా భావించేవారని అన్నారు. 1991 ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, ఆధునిక ఆర్థిక శక్తిగా, సమాచార సాంకేతిక రంగంలో ప్రపంచస్థాయి దేశంగా భారతదేశం ఎదగడానికి పి.వి. నరసింహారావు బలమైన పునాది వేశారని చెప్పారు. రాజకీయాలకే పరిమితం కాకుండా ఆర్థిక శాస్త్రం, సాహిత్యం, చరిత్ర, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, ఖగోళశాస్త్రం వంటి అనేక రంగాల్లో ఆయనకు విశేష ఆసక్తి ఉండేదని పేర్కొన్నారు. చివరి వరకు నిరంతరం అధ్యయనం చేస్తూ జీవితాంతం విద్యార్థిగానే కొనసాగారని స్మరించుకున్నారు. యువత దేశభక్తి, క్రమశిక్షణ, నిజాయితీ, దేశసేవ పట్ల అంకితభావం వంటి పి.వి. ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, రచయితలు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, పి.వి. నరసింహారావు అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) అధ్యక్షులు డా. జితేందర్ రావు తనుగుల కూడా పాల్గొన్నారు. భారతరత్న పి.వి. నరసింహారావు జీవితం, సేవలు, వారసత్వం భావితరాలకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తూ భారత ప్రజాస్వామ్య, మేధో, ఆర్థిక ప్రగతికి మార్గదర్శకంగా కొనసాగుతాయని వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

# టీ వై జె ఎఫ్ అందోల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి జెల్ల భాగయ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహణ





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 1 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జెల్ల భాగయ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భాగయ్య ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆబేద్, నియోజకవర్గ అధ్యక్షులు రాజు, ఉపాధ్యక్షులు బుచ్చయ్య, కోశాధికారి నాగరాజ్, ఆర్గనైజర్ సెక్రటరీ సుకుమార్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇటిక్యాలలో ఐజెల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన స్వప్న సురేందర్ గౌడ్





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 1( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్ మండలంలోని ఎస్. ఇటిక్యాల గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐజెల్ వాటర్ స్టేషన్‌ను స్వప్న సురేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్లాంట్‌ను ప్రజలకు అంకితం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించే అవకాశం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# సాయిబాన్ పేట్ గ్రామ ప్రజలకు అన్ని రంగల్లో ప్రభుత్వవిధానాలు అందరికి అందుబాటులో ఉండి సహకరించలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 1(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సాయిబాన్ పేట్ గ్రామం లో కొత్తగా వచ్చిన విల్లెజి పంచాయతీ సెక్రటరీ నీర్లక్ష్యం. ఇంతకు ముందు ఉన్న అశోక్ అనే పంచాయతీ సెక్రటరీ ఏదైనా గవర్నమెంట్ ప్రోగ్రాములు గాని సమస్యలు గానీ పర్సనల్ సమస్యలు గానీ ఉంటే మాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు తెలియని తెలియజేసి ఏది ఎలా అప్లై చేసుకోవాలి ? ఎలా చేసుకోవాలి దాని విధానం ఏంటి ప్రొసీజర్ ఏంటి అన్నది క్లుప్తంగా వివరించి అయన మాకు ఎంతో కృషి చేశారు..కానీ ఇప్పుడు అయన బదిలీ పై మరొక విల్లెజి వెళ్లారు. ఇప్పుడు వచ్చిన గ్రామపంచాయతీ సెక్రటరీ నూతన సర్పంచ్ కి మరియు నూతనంగా ఎన్నుకోబడ్డ వార్డు సభ్యులకు మాత్రమే తెలుసు కానీ గ్రామస్తులకు ఎవరికి కూడా ఇంతవరకు కొత్తగా వచ్చిన పంచాయతీ సెక్రెటరీ ఎవరు అనేది తెలియదు కానీ ఇప్పుడు ఎస్ ఐ ఆర్ సర్ అనే గవర్నమెంట్ ప్రోగ్రామ్ జరుగుతుంది. కానీ ఒక నూతన ఓటర్ లిస్టు గ్రామపంచాయతీ దగ్గర లేదు అలాగే 2002 నుంచి ఎలక్షన్లో పాల్గొన్నవారు చనిపోయిన వారు అని ఒక ప్రొసీజర్ అప్లికేషన్ ఇంటికి పంపిస్తున్నారు దాన్ని ఫిల్ అప్ చేసి దానికి ఫోటో జోడించి మాకు ఇవ్వాలని మా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ తో విలేజ్లో పంపిణీ చేస్తున్నాడు. అది ఎవరికి అవగాహన లేదు ఎలా నింపాలి ఎక్కడెక్కడ ఏ సంఖ్యలో అంకెలు వేయాలి చనిపోయిన వాళ్ళు ఎట్లా తీసేయాలి నూతన కొత్త ఓటర్ లిస్ట్ వాళ్ళు ఎలా అప్లై చేసుకోవాలని కూడా ఎవరికీ అవగాహన లేదు ఏమన్నా అంటే ఆన్లైన్లో అప్లై చేసుకోవాలి అని ఒకటి చెబుతున్నారు 18 సంవత్సరాల నుండి పిల్లలకు కానీ సర్ ప్రోగ్రాం లో ఉన్న ప్రొఫార్మాలలో చాలా భిన్నమైన కృశ్నస్లు అందులో ఉన్నాయి చదువుకున్న మంది చాలా మంది ఉన్నారు కానీ మాకు విలేజ్లో చదువుకున్న వారి గిట్ల అర్థం కావటం



లేదని దానికి తోడు కొత్త పంచాయతీ సెక్రెటరీ నిర్లక్ష్యం ఓటర్ లిస్ట్ లోని క్రమ సంఖ్య వరుస సంఖ్య అనేది ఎక్కడ చూసి వేయాలి మేము ఎక్కడి నుంచి తీసుకురావాలి. అన్ని విలేజ్లో ఇంటింటికి తిరుగుతూ వచ్చి సర్వే చేస్తున్నారు దాన్ని మా దగ్గరనేమో ప్రొఫార్మర్లు మా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ తోటి పంపిణీ చేయించి ఇంటింటికి ప్రొఫార్మ్ పంచుతూ చేతులు దులుపుకుంటున్నారు. అది మాకు అర్థం కావట్లేదు ఎలా అనేది అన్ని విలేజ్లో కొరకంగా ఉంటే ఈ విలేజ్లో కొరకంగా ఉంది దీనికి ప్రశ్నించే వాళ్ళు ఎవరూ లేరు. ఇచ్చిర్ర తీసుకుని నింపి ఇవ్వాలి అంతే ఇలానే ఇవ్వాలి దీని ప్రొసిజర్ ఏంటి ఎక్కడ మిస్టేక్ అయితే ఇక్కడ ఓటు ఎక్కడికి పోతుంది చనిపోయిన వాళ్ళది ఓటు మిస్టేక్ ఎట్లా తీసేస్తాము నూతనంగా 18 సంవత్సరాలు నిండిన పిల్లలు ఎలా ఓటు హక్కు కల్పించుకోవాలి అని అవగాహన కూడా తెలియజేయకుండా అప్లికేషన్ ఫారం లో మా ఇంటింటికి మన ఎలక్షన్లు కరపత్రికలు పంచినట్టుగా మాదిరిగా పంచుతున్నారు దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము ఉన్నట్టుగా మా విలేజ్ లో బి ఎల్ ఓ ఎవరో చెప్పి ఇంటింటికి వాళ్లే తిరిగి సరైన రీతిలో అన్ని సమాచారాం తీసుకోవాలని మా యొక్క డిమాండ్ లేనియెడల మా విలేజ్ కి ఎన్నో ఓట్లు కోల్పోయే అవకాశం ఉంటుంది. నా ఉద్దేశ్యం ఏంటంటే పంచాయతీ సెక్రటరీ పై నాకు ఎలాంటి దుర్వేశం లేవు కానీ అన్ని విలేజ్లో కూడా సర్వే బి ఎల్ ఓ సర్వే ఎవరైతే ఉన్నారో వాళ్ళు ఇంటింటికి తిరిగి సర్వే చేసి అప్లికేషన్ ఫిల్ అప్ చేసి వాళ్ళు సర్వీస్ సేకరిస్తున్నారు కానీ ఈయన చేయటం లేదు అందుకోసమే నేను మాట్లాడుతున్నాను ఇందులో మా విలేజ్లో కూడా కొంతమందికి హైదరాబాద్లో ఉన్న గాని విలేజ్ లో ఉన్నవారు గానీ రెండు రెండు ఓటు హక్కు కలిగి ఉన్నారు వాళ్లను వెలికి తీయడమే ఈ ప్రభుత్వం ఉద్దేశం మంచిది కానీ ఎవరు ప్రొఫార్మా వాళ్ళకి ఇంటికి ఇచ్చి మీరు నింపి ఇవ్వండి మేం దాన్ని తర్వాత చూసుకుంటామని అంటే మల్ల ఏడేసిన గొంగడిలా ఉన్నట్టుగా ఉంటుంది. కాబట్టి ముఖ్యంగా తెలియజేయడం ఏందంటే గ్రామపంచాయతీ పని సెక్యూరిటీ గాని సాయిబాబా పేట చెందిన బి ఎల్ ఓ ఎవరైతే ఉన్నారో వారు స్వయంగా ఇంటింటికి వచ్చి సర్వే పూర్తి చేస్తే చాలా పద్ధతిగా ఉంటుంది. సమాచారం కూడా క్లుప్తంగా మీకు కూడా తెలుస్తుంది మా విలేజ్ ఏంటో అనేది మీకు అవగాహన వస్తుంది దయచేసి గ్రామపంచాయతీ సర్పంచ్ గాని పెద్దలు దీని దృష్టిలో తీసుకొని ప్రోగ్రాంలో పాల్గొని నిజమైన సమాచారాన్ని గవర్నమెంట్ కు తెలియజేయాలని కోరుకుంటున్నాను. నూతనంగా వచ్చినటువంటి మా విలేజ్ పంచాయతీ సెక్రెటరీ మాకు అందుబాటులో ఉండి మాకు అన్ని విధాలుగా ప్రజల్లో ఒక్కడిగా ఉండి వారికి సహాయ సహకారాలు అందించాలని మా యొక్క మనవి. వెంటనే ఆయన పద్ధతి మార్చుకోక పొతే జిల్లా కలెక్టర్ గారికి పిర్యాదు చేస్తా ము అని బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు పాండురగం డిమాండ్ చేశారు

# నిర్వాసిత ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ.

## తల్లెం భరత్ కుమార్ రెడ్డి.





**రైల్వే కోడూరు జూలై 1 రిపబ్లిక్ న్యూస్.** ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామ పంచాయతీ నిర్వాసిత గ్రామాలైన,కాపు పల్లి, హరిజన వాడ, అరుంధతివాడ,కొత్త మంగంపేట 10, 11కు సంబంధించి బూత్ నంబర్ల 156 157 ఏన్యూమరేషన్ పత్రాలు నింపి బిఎల్ఓ లతో పంపిణీ చేయడం జరిగిందని బుధవారం వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్, గుంతకల్లు రైల్వే డిఆర్సి నెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి తెలిపారు,ఆయన మాట్లాడుతూ మంగంపేటలో డేంజర్ జోన్ కింద తరలించిన గ్రామాలు దాదాపు 4 గ్రామాలు ఉన్నవి మంగపేట 2002 ఈ గ్రామాలకు సంబంధించిన అడ్రస్ 2002 అడ్రస్ మంగపేట వి 2002 తర్వాత కొత్త అడ్రస్ లు వచ్చి ఉన్నవి, బి ఎల్ ఓ తో సమన్వయ పరచుకొని ప్రస్తుతం ఉన్న అడ్రస్సులు తెలియపరుస్తూ బిఎల్ఎ లతో కలిసి రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి బిఎల్ఎలు ఓబులేసు, శివ శంకర్ రెడ్డి మరియు మొగిలి నవీన్ కుమార్ ఇద్దరితో కలిసి సర్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. నింపిన ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. ఓటర్లు తమ పత్రాలను సక్రమ పద్ధతులు ఫీల్ చేసి తప్పులు దొరలకుండా సరిచేసుకోవాలని ఆయన అన్నారు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు

# ప్రాణం పోసే వైద్యుడే దేవుడు ..

**డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి**

**గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్లో వైద్యుల దినోత్సవ వేడుకలు**




**నంద్యాల జూలై 1 (రిపబ్లిక్ న్యూస్) :**నంద్యాల జిల్లా బాబా నగర్ గురురాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా వైద్యుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గురు రాజా ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన వైద్య దినోత్సవ వేడుకలు గురు రాజ ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ వైద్యులు ప్రాణాలను నిలిపి దేవుళ్ళని గుర్తు చేశారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైన తెలిపారు. ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడే శక్తి డాక్టర్లకే ఉంటుందని చెప్పారు. వైద్యుల సేవలు ఎన్నటికీ మరువరాదని అన్నారు. కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఎంతోమందిని కాపాడాలని అలాంటి వారిని దేవుళ్ళుగా పూజించాలని తెలిపారు. వైద్య గుర్తుంచుకున్న ప్రతి ఒక్క విద్యార్థి దేవునితో సమానంగా భావించాలని వారు చేసే ప్రతి వైద్యం ప్రాణాలను కాపాడేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం వివిధ రంగాల సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. అనంతరం పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ వైద్యులు అంటే ప్రాణాలు కాపాడే దేవుళ్ళు అని తెలిపారు. వైద్య వృత్తిని ఎంచుకున్న ప్రతి ఒక్కరూ దేవునితో సమానమని కొనియాడారు. వారు చేసే సామాజిక కార్యక్రమాలు అందరికీ ఆదర్శమని చెప్పారు. అనంతరం వివిధ రకాల వైద్య సేవలు అందించిన వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పూర్తి నింపేలా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జులై 1 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా బి ఎల్ వో లకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా నందవరం 1,2, సచివాలయాల పరిధిలోని 188, 189, 190, 191 పోలింగ్ బూతులకు సంబంధించిన బిఎల్వోలకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పురోగతిపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి సంబంధించి ఎటువంటి సందేహాలున్న వెంటనే సంబంధిత పై అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. బిఎల్ఓ లు ఓటర్ల నుంచి ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఓటర్ల వివరాలు డిజిటలైజేషన్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు వెరిఫై చేసి ఆన్లైన్లో ఎక్కించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు స్వయంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ఎలా పూర్తి చేయాలి అనే అంశాలకు సంబంధించి సెల్ ఫోన్ ద్వారా బిఎల్ఓ లకు వివరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్, సచివాలయ సిబ్బంది, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## పిఎం ఎఫ్ఎంఈ కింద మంజూరైన యూనిట్లను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లను ప్రోత్సహించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల, బ్యూరో జులై 1( రిపబ్లిక్ న్యూస్):**ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ కింద జిల్లాకు మంజూరైన యూనిట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులకు సూచించారు.గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పైన అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి అనుకూలమైన వసతులు ఉన్నాయని అధికారులందరూ బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకొని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి ప్రత్యేక కృషి చేయాలన్నారు.2025- 26 సంవత్సరంలో ఇచ్చిన టార్గెట్ ను జూలై 15వ తేదీ లోపల పూర్తి చేయాలని బ్యాంకాలను కోరారు. 2026 -27 సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లాకు 50 యూనిట్లు టార్గెట్ ఇవ్వడం జరిగింది ఇందుకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించి ఈనెల చివరిలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.ఈ పథకం కింద మెప్మా, సేర్ఫ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖలకు సంబంధించిన అధికారులందరూ లబ్ధిదారులను గుర్తించి ప్రాజెక్టులు తయారుచేసి డిఆర్పీలు, బ్యాంకర్లు సమన్వయంతో జిల్లాకు కేటాయించిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. నంద్యాల జిల్లాలో ఎక్కువగా చిల్లి, మిల్లెట్స్,బేకరీలకు సంబంధించిన ప్రాజెక్టులుఅరటికి సంబంధించిన ప్రాజెక్టులు ఎక్కువగా వస్తున్నాయని వీటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు.మరియు డ్రై మటన్, డ్రై ఫిష్, డి హైడ్రేటెడ్ ఆనియన్స్, డీ హైడ్రేటెడ్ వెజిటేబుల్స్, ఇలాంటి వాల్యూ కు సంబంధించిన ప్రాజెక్టులన్ని చేసేందుకు మరింత కృషి చేసి లబ్దిదారులకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఎల్ డి ఎం, డి ఎం నాబార్డ్, జిల్లా లోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, జెడి ఫిషరీస్, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హాజీలకు రూ. 3.31 కోట్లు చెల్లింపు

**విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి వెళ్లిన యాత్రికుల అకౌంట్లకు జమ**

**హజ్ యాత్రికులకు ఇచ్చిన హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం**

**యాత్ర విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన హాజీలు**

**హజ్-2027 కు దరఖాస్తు చేసుకోండి**

**మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



**అమరావతి, జూలై 01( రిపబ్లిక్ న్యూస్) :**
విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ద్వారా పవిత్ర మక్కా హజ్ యాత్రకు వెళ్లి విజయవంతంగా యాత్ర పూర్తి చేసిన హాజీ లకు రూ. 3.31 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంక్ అకౌంట్లకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి ) విధానంలో జమ చేసినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి రెండు దశల్లో వెళ్లిన 331 మంది హాజీ లకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని హాజీల అకౌంట్లకు ప్రభుత్వం జమ చేసినట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.హజ్ యాత్ర -2026 కోసం ఆంధ్రప్రదేశ్ నుండి దాదాపు 2000 మంది యాత్రికులు బయలుదేరి వెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇందులో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను ఆప్షన్ గా ఎంచుకొని వెళ్లిన వారందరికీ ఒక్కొకరికి రూ. లక్ష ఆర్థిక సాయంను అందించడం జరుగుతుందని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, కార్యాచరణ బద్ధంగా ఇక్కడి నుండి అక్కడికి వెళ్లేంతవరకు, యాత్ర ముగించుకొని అక్కడినుండి ఇక్కడికి చేరేంతవరకు మైనారిటీ సంక్షేమ శాఖ, అనుబంధ శాఖలు సమిష్టిగా నిరంతరం పర్యవేక్షించడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హాజీలందరూ విజయవంతంగా యాత్ర ముగించుకుని తిరిగి వచ్చారని, ప్రభుత్వ ఏర్పాట్లను ప్రతి హాజీ మెచ్చుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి చిత్త శుద్ధితో పనిచేస్తుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.హజ్ యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**హజ్-2027 కు దరఖాస్తు చేసుకోండి**

పవిత్ర హజ్ యాత్ర -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20 తేదీ వరకు గడువు నిర్దేశించబడిందని, గడువుకు ముందే దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.భారత ప్రభుత్వం, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై, హజ్2027 యాత్రకు సంబంధించిన నోటిఫికేషన్ను ఇప్పటికే విడుదల చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆన్లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ 22-06-2026 నుండి ప్రారంభమైందన్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 20-07-2026 అయినందున యాత్రకు వెళ్లాలనుకునేవారు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఆన్లైన్ దరఖాస్తుకు తెల్లని బ్యాక్గ్రౌండ్తో తీసిన పాస్పోర్ట్ సైజు ఫోటో, బ్యాంకు పాస్బుక్ జిరాక్స్ కాపీ, చెల్లుబాటు అయ్యే చిరునామా రుజువు జిరాక్స్ కాపీ,హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకునే యాత్రికుల పాస్పోర్ట్ కనీసం 31 డిసెంబర్ 2027 వరకు చెల్లుబాటు అయ్యే విధంగా ఉండాలని, సంబంధిత వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి ఫరూక్ సూచించారు. హజ్2027 యాత్ర చేయాలనుకునే రాష్ట్రంలోని ముస్లిం సోదరులు, సోదరీమణులు అందరూ విజయవాడ ఎంబర్కేషన్ పాయింట్ ఎన్నుకుని ప్రభుత్వమిచ్చే ఆర్థిక సహాయం లక్ష రూపాయలను వినియోగించుకోవాలని కోరారు. చివరి తేదీకి ముందుగానే తమ దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకొని, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా తమ హజ్ యాత్రను సురక్షితంగా, సక్రమంగా నిర్వహించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

# బనగానపల్లెలో సీఎం పర్యటనపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్ష

**జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి స్థల పరిశీలన చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**





**నంద్యాల బ్యూరో, జూలై 1 (రిపబ్లిక్ న్యూస్):**
నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేపథ్యంలో ఆర్ & బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షెరాన్‌లతో కలిసి మంత్రి బనగానపల్లెలో క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. అనంతరం సీఎం పర్యటనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన భద్రత చర్యలు, ఏర్పాట్లపై బనగానపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**భారీ బహిరంగ సభకు స్థల పరిశీలన**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ సునీల్ షెరాన్ కలిసి స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేని విధంగా స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి బనగానపల్లె నియోజకవర్గానికి రానుండటంతో భారీగా తరలివచ్చే ప్రజానీకానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష**

అనంతరం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం సభకు సంబంధించిన ప్రజా వేదిక, హే లిప్యాడ్ ఏర్పాటుపై చర్చించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ అంతరాయం లేకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను అత్యంత సక్రమంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

**. నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరుమల పునీత్ ఆసుపత్రి -. జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరం ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

**. నంద్యాల వైద్యుల సేవలు అభినందనీయం: జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్.**

**. వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజల సేవ కోసం పునరంకితం కావాలి: డాక్టర్ రవి కృష్ణ**




**నంద్యాల జూలై 1( రిపబ్లిక్ న్యూస్) :**
స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి రాయి జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మరియు నంద్యాల ప్రధమ ఈఎన్టీ వైద్యులు దివంగత డాక్టర్ సత్యనారాయణ జ్ఞాపకార్థం, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ సహకారంతో తిరుమల పునీత్ ఈ ఎన్ టి మరియు స్కిన్ ఆసుపత్రి నిర్వహణలో, రాష్ట్ర ప్రభుత్వ పిలుపుమేరకు పి 4 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ డాక్టర్ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నంద్యాల వైద్యులు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ,దివ్యాంగులకు, దేశ రక్షణలో పనిచేస్తున్న త్రివిధ దళాల ఉద్యోగుల కుటుంబాలకు ఉచిత ఓ పి డి సేవలు అందిస్తూ రాష్ట్రంలోని వైద్యులకు ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు. ఎన్ ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వైద్య సేవలే కాకుండా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలలో వైద్యులు ముందు ఉండడం ప్రశంసనీయమన్నారు. వైద్యుల దినోత్సవం వేడుకలలో భాగంగా ఫిరోజ్ కేక్ కట్ చేసి వైద్యులకు అందించారు.

ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర మాజీ ఐఎంఏ అధ్యక్షులు, లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులందరూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుమల పునీత్ ఈఎన్టి స్కిన్ ఆసుపత్రి తరపున డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ విజయబాబు, నంద్యాల మహిళా వైద్యుల విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, వెలాసిటీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ లకు వైద్యుల దినోత్సవ పురస్కారాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందించి సత్కరించారు.

వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యురాలైన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని నంద్యాల ఐఎంఏ మహిళా వైద్యులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ కల్లూరి రామలింగారెడ్డి, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ నాగమణి,డాక్టర్ నర్మద, డాక్టర్ లలిత, ప్రజలు పాల్గొన్నారు.

**విజయవంతమైన వైద్య శిబిరం:**

ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ అనిల్ కుమార్,ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు చర్మవ్యాధి నిపుణురాలు డాక్టర్ హరిత దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా లక్ష రూపాయలు విలువచేసే మందులు పంపిణీ చేశారు.
70 మందికి అవసరమైన వినికిడి పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించడం జరిగింది.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com